


కామారెడ్డి జిల్లా పెద్దకొడప్‌గల్ సబ్‌స్టేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అల్లాపూర్ రైతులు

## సబ్ స్టేషన్ ఎదుట రైతుల ధర్నా

పెద్దకొడప్‌గల్, జూన్ 7: విద్యుత్తు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి జిల్లా పెద్దకొడప్‌గల్ సబ్‌స్టేషన్ కార్యాలయం ఎదుట అల్లాపూర్ రైతులు శనివారం బైఠాయించారు. వారంలో రెండ్రోజులు కరెంట్ లేక ఇబ్బందులు పడుతున్నామని, రాత్రయితే నరకం చూస్తున్నామని వాపోయారు. నెల రోజులుగా జేఎల్ఎం లేకపోవడంతో అనేక సమస్యలు వస్తున్నాయని, ఏ అధికారిని అడిగినా స్పందించడంలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. పొలాల్లో విద్యుత్తు వైర్ల సమస్యలు వస్తే ఎల్‌సీ ఇవ్వమని అడిగితే ఇవ్వడంలేదని, లైన్‌మన్ చెబితేనే ఇస్తామని చెబుతున్నారని వాపోయారు. ఇన్‌చార్జి ఏఈ పవన్ వచ్చి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

## కేస్.. గీస్.. జాన్తానై..?

- 'ఇథనాల్' ఆందోళనలో మహిళపై సిబ్బంది దాడి
- న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించిన మరియమ్మ
- కేసు నమోదు చేయబోమని ఎస్సై బెదిరింపులు



ఇథనాల్ కంపెనీ సిబ్బంది దాడిలో తలకు గాయంతో మరియమ్మ

మహబూబ్‌నగర్, జూన్ 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఈ ఫొటోలో కనిపిస్తున్న ఆమె పేరు మరియమ్మ.. జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం రాజోళి మండలం పెద్ద ధన్వాడ. గ్రామ సమీపంలో ఏర్పాటవుతున్న ఇథనాల్ కంపెనీ వద్దని ధర్నా చేయడానికి వెళ్లగా అక్కడున్న గాయత్రి రెన్యూవబుల్ ఫ్యూయెల్స్ అల్లాయిడ్ ఇండస్ట్రీకి చెందిన బౌన్సర్లు ఆమెపై కర్రలతో కొట్టడంతో తలపై బలమైన గాయమైంది. రక్తం కారుతున్నా ఒక్క పోలీస్ కూడా కనికరించలేదు. తలపై గాయంతో చీరకొంగు కప్పుకొని రక్తస్రావాన్ని ఆపుతూ హుటాహుటిన గద్వాల ప్రభుత్వ దవాఖానకు వెళ్లి చికిత్స చేయించుకొని వచ్చింది. ఇప్పటికీ గాయం అలాగే ఉన్నది. తనపై కంపెనీ ప్రతినిధులు దాడి చేశారని గురువారం రాజోళి పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేయగా.. ఎస్సై జగదీశ్వర్ మాత్రం 'కేసు గీస్ జాన్తానై'.. అంటూ ఉల్టా బెదిరించి పంపించారు. విచిత్రం ఏమిటంటే కంపెనీ సిబ్బందికి చిన్న గాయం కాకున్నా.. ప్రజలు అక్కడి టెంట్లపై.. కంటైనర్‌పై.. దాడి చేస్తే తమపై హత్యాయత్నం చేశారని రైతులకు వ్యతిరేకంగా ఫిర్యాదు చేశారు. దీంతో సదరు ఎస్సై 17 సెక్షన్లతో కేసు నమోదుచేయడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. అదే పేద మహిళ తనపై దాడి చేసింది కంపెనీ వాళ్లే అని గాయం చూపించినా ఫిర్యాదు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తున్నది. పోలీసు యంత్రాంగం కంపెనీకి కొమ్ముకాస్తున్నారు.. అనడానికి ఈ ఘటనే నిదర్శనమని ప్రజాసంఘాలు ఆరోపిస్తున్నాయి.

# అన్నదాతలను గోస పెట్టొద్దు

- ఏడు దశాబ్దాలుగా ఆ భూముల్లో అన్నదాతల సాగు
- గోశాలకు భూములిచ్చే యత్నాన్ని విరమించుకోవాలి డిమాండ్
- రాష్ట్రంలో అస్తవ్యస్తంగా 18 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలన
- భూములను అమ్మడమే సీఎం రేవంత్ సర్కార్ పని
- ప్రభుత్వంపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఫైర్
- ఎన్కేపల్లి భూముల సందర్శన.. పార్టీ అండగా ఉంటుందని భరోసా



రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్కేపల్లిలో భూ బాధితులతో కలిసి ఆందోళన చేస్తున్న మాజీ మంత్రి సబిత

మొయినాబాద్, జూన్ 7: తాతల కాలం నుంచి అన్నదాతలు ఆ భూములు సాగు చేసుకుంటారని.. వారిని గోస పెట్టి గోశాలకు భూములు ఇచ్చే ప్రయత్నాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధి ఎన్కేపల్లి గ్రామంలోని 180 సర్వేనంబర్‌లోని 100ఎకరాలను ప్రభుత్వం తీసుకోవాలని యత్నిస్తున్నది. ఈ నేపథ్యంలో శనివారం ఆమె ఆ భూములను సందర్శించారు. బాధిత రైతులతో మాట్లాడి.. వారికి బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. ఎన్కేపల్లి గ్రామంలోని 100 ఎకరాల్లో 50 మంది రైతులు ఏడు దశాబ్దాలుగా ఆ భూములు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపింది. కోకాపేటలోని గోశాలకు చెందిన 100 ఎకరాల భూమిని ప్రభుత్వం తీసుకొని.. అందుకు ప్రత్యామ్నయంగా ఎన్కేపల్లిలోని భూములను గోశాలకు కేటాయించాలని చూస్తున్నదని తెలిపారు. ఐదారుగురు రైతులను చర్చలకు పిలిచి భూములను లాక్కోవాలని కుట్ర చేస్తున్నదని సబితాఇంద్రారెడ్డి ఆరోపించారు. 2013 చట్టం ప్రకారం రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులను భయభ్రాంతులకు గురిచేసి బలవంతంగా భూములు లాక్కోవాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఎన్కేపల్లి రైతులకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని, మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు వారికి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు.

### సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసినా..

హైదరాబాద్‌లోని కంచ గచ్చిబౌలి భూములను అప్పనంగా బడాబాబులకు కట్టబెట్టాలనే ఆలోచనతో రేవంత్ ప్రభుత్వం ఉంటే సుప్రీంకోర్టు ఆ భూములను అమ్మొద్దని మొట్టికాయలు వేసిందని గుర్తుచేశారు. దీంతో ఇతర భూములను అమ్మాలని యత్నిస్తున్నదని.. అందులో భాగంగానే కోకాపేట గోశాల భూమిని తీసుకొని ఎన్కేపల్లి భూములను గోశాలకు ఇవ్వాలని చూస్తున్నదని మండిపడ్డారు. భూములను అమ్మడమే రేవంత్‌రెడ్డి సర్కారు పనిగా పెట్టుకుందని ఎద్దేవా చేశారు. 18నెలల కాంగ్రెస్ పాలన అస్తవ్యస్తంగా మారిందని.. ఏ ఒక్కరూ సంతోషంగా లేరని పేర్కొన్నారు.

### జీవో 111పై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి..

ఈ ప్రాంత ప్రజల క్షేమం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జీవో 111ను ఎత్తివేస్తూ మాజీ సీఎం కేసీఆర్ జీవో 69ను విడుదల చేశారని గుర్తుచేశారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జీవో 111 అమలులో ఉందని, అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ప్రజలపై ఉక్కుపాదం మోపుతున్నారని మండిపడ్డారు. ఈ ప్రాంత ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని జీవో 111ను ఎత్తివేయాలని.. బీఆర్‌ఎస్ హయాంలో జారీ చేసిన జీవో 69ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సబితా ఇంద్రారెడ్డి వెంట బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బారెడ్డి వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి సమస్యను చెప్పుకుంటున్న బాధితురాలు

### చిన్న, సన్న కారు రైతులను వేధిస్తున్నారు..

చిన్న, సన్న కారు రైతులు సాగు చేసుకుంటున్న భూములను రేవంత్ సర్కారు బలవంతంగా లాక్కుంటుందని మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి వాపోయారు. లగచర్లలో భూములు అవసరం లేకున్నా బలవంతంగా లాక్కునే ప్రయత్నం చేసిందని.. ప్రభుత్వ ప్రయత్నాన్ని రైతులు అడ్డుకుంటే వారిపై కేసులు పెట్టి జైలుకు పంపించి వేధిస్తున్నదని మండిపడ్డారు. 14వేల ఎకరాల ఫార్మాసిటీ భూములు ప్రభుత్వం చేతుల్లో ఉన్నప్పటికీ ఇబ్రహీంపట్నం, కందుకూరు, మహేశ్వరం మండలాల్లో 3,000 ఎకరాలను తీసుకునే ప్రయత్నం చేస్తుందని పేర్కొన్నారు. ఆ భూములు ఎందుకు తీసుకుంటున్నారో ప్రభుత్వ స్పష్టంగా ప్రకటించడం లేదని తెలిపారు. ఫార్మాసిటీలో నాలుగైదు రోడ్లు ఉన్నప్పటికీ, మళ్లీ రోడ్లు వేస్తున్నారని.. ఎవరికోసం రోడ్లు వేస్తున్నారో చెప్పాలని నిలదీశారు. గద్వాలలో సన్న, చిన్న కారు రైతులు సాగు చేసుకుంటున్న భూములను విత్తనాల కంపెనీకి కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. భూములను ఇవ్వబోమని రైతులు ఆందోళన చేస్తుంటే వారిపై లాఠీచార్జి చేసి 40మందిపై కేసులు పెట్టి వేధించడం దారుణమని ఆవేదన వ్యక్తంచేశారు. వారం రోజుల క్రితం సంగారెడ్డిలో రైతుల నుంచి అక్రమంగా భూములను లాక్కుందని ఆరోపించారు. ఎన్కేపల్లిలోనూ భూములను తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నదని మండిపడ్డారు. పోలీసులను కాపలా పెట్టి ఆ భూముల్లోకి ఎవరిని రానివ్వడం లేదని, సాగు చేసుకోకుండా అడ్డుపడుతున్నదని వాపోయారు.

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

- పంట దిగుబడిరాక తీవ్ర నష్టం
- ఉరేసుకుని బలవన్మరణం
- కామారెడ్డి జిల్లాలో విషాదం



పెంటయ్య (ఫైల్)

రాజంపేట్, జూన్ 7: అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం ఆర్గొండలో చోటుచేసుకున్నది. ఎస్సై పుష్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్గొండకు చెందిన జంగిటి పెంటయ్య (48) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇద్దరు కూతుళ్ల పెండ్లి కోసం అప్పులు చేశాడు. జొన్న పంటను అమ్ముకొని అప్పులు తీరుద్దామని ఆశించాడు. పంట దిగుబడి రాకపోవడంతో నష్టాలపాలయ్యాడు. ఒకవైపు చేసిన అప్పులు తీర్చలేక, మరోవైపు పంట దిగుబడి రాక అప్పు ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం పొలం వద్ద వెళ్లి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య రాజమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

## చౌదర్‌పల్లి భూములపై విచారణ జరపండి

**సిద్దిపేట కలెక్టర్‌కు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఆదేశం**



బక్కి వెంకటయ్య

దుబ్బాక, జూన్ 7: సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గం అక్బర్‌పేట-భూంపల్లి మండలం చౌదర్‌పల్లిలోని అసైన్డ్ భూముల ఆక్రమణలపై విచారణ జరపాలని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. ఈ మేరకు శనివారం ఆయన దుబ్బాకలో ఓ ప్రకటన విడుదల చేశా రు. చౌదర్‌పల్లిలో అసైన్డ్ భూముల ఆక్రమణలపై వివిధ పత్రికల్లో వచ్చిన వార్తలను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సుమోటోగా స్వీకరించిందని, దీనిపై విచారణ చేపట్టాలని కలెక్టర్‌ను ఆదేశించినట్టు పేర్కొన్నారు. ఆ భూముల ఆక్రమణలు, క్రయవిక్రయాలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి 15రోజుల్లో తమకు నివేదిక సమర్పించాలని సూచించారు. అసైన్డ్ భూములు పేదల బతుకుదెరువు కోసం మాత్రమే ప్రభుత్వాలు పంపిణీ చేశాయని తెలిపారు. సదరు భూములు పెద్దల చేతుల్లోకి పోవడం సరికాదని, ఆ భూములను తిరిగి స్వాధీనపరుచుకుని పేదలకు అందజేయాలని సూచించారు.

## హనీమూన్ టూర్ విషాదాంతం

- వాటర్ బాటిల్ కోసం రైలు దిగిన యువకుడు
- తిరిగి రైలు ఎక్కుతుండగా పడిపోయి మృతి



సాయి (ఫైల్)

మారేడ్‌పల్లి, జూన్ 7: భార్య, బంధువులు, స్నేహితులతో కలిసి ఆనందంగా గోవా యాత్రకు వెళ్లేందుకు పయనమైన నవవరుడిని మృత్యువు వెంటాడింది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో కదిలే రైలు ఎక్కుతుండగా కాలుజారి కిందపడ్డ ఆ యువకుడు దవాఖానలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... వరంగల్‌కు చెందిన సాయి (28) ప్రైవేటు ఉద్యోగి. అతడికి మూడు నెలల కిందట పెళ్లి జరిగింది. భార్య, బావమరిది, ఇద్దరు స్నేహితులతో కలిసి గోవా వెళ్లాలని అనుకున్నాడు. వరంగల్ నుంచి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు వచ్చారు. అందరూ వాస్కోడిగామా ఎక్స్‌ప్రెస్ ఎక్కి సీట్లలో కూర్చున్నారు. రైలు ఇంకా కదలకపోవడంతో వాటర్ బాటిల్ కోసం సాయి కిందకు దిగగా, రైలు కదలడంతో రైలు లోపల ఉన్న స్నేహితులు స్టాప్ చైన్ లాగారు. రంగంలోకి దిగిన ఆర్పీఎఫ్ పోలీసులు ఆ ఇద్దరిని రైలు నుంచి కిందకు దించి.. చైన్ ఎందుకు లాగారంటూ విచారించారు. తమ ఫ్రెండ్ వాటర్ బాటిల్ కోసం కిందికి దిగాడని, రైలు కదలడంతో.. ఆపడం కోసం చైన్ లాగామని సాయి స్నేహితులు చెప్పారు. ఇంతలో సాయి కూడా అక్కడికి వచ్చి పోలీసులతో మాట్లాడుతుండగా, రైలు మళ్లీ కదిలింది. సాయి భార్య మాధురి, బావమరిది రైలులోనే ఉండిపోవడంతో... హడావుడిగా సాయి పరిగెత్తుకెళ్లి రైలు ఎక్కేందుకు ప్రయత్నించగా, ప్రమాదవశాత్తు కాలు జారి రైలు, ప్లాట్‌ఫారం మధ్య గ్యాప్‌లో పడిపోయాడు. ఆర్పీఎఫ్ పోలీసులు అతడిని దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆర్పీఎఫ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రైతుపైనే సోలార్ ప్లాంట్ల విద్యుత్తు భారం

- సోలార్‌ప్లాంట్లకు హెచ్‌టీ విద్యుత్తు కనెక్షన్ తప్పనిసరి
- ఉచిత విద్యుత్తు కనెక్షన్ ఊస్ట్.. రైతుభరోసా కట్ చేసే యోచన
- పరిశ్రమలకిచ్చే కనెక్షన్లు తీసుకోవాలంటూ షరతులు
- పీఎం కుసుమ్ ప్లాంట్ల అగ్రిమెంట్లకు రంగం సిద్ధం
- నేడు, రేపు పీపీఏలపై లబ్ధిదారులకు కబురు
- నిబంధనలపై తీవ్ర అభ్యంతరం.. మార్చాలని రైతుల డిమాండ్



హైదరాబాద్, జూన్ 7 (నమస్తే తెలంగాణ): సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునే రైతులపైనే విద్యుత్తు భారం పడనున్నది. ఈ మేరకు టీఎస్ రెడ్కో మరో నిబంధన విధించింది. రైతులు తమ స్థలాల్లో ఏర్పాటు చేసుకునే సోలార్ విద్యుత్తు ప్లాంట్లకు హెచ్‌టీ విద్యుత్తు కనెక్షన్ తీసుకోవాలని టీజీ రెడ్కో అధికారులు నిబంధన పెట్టారు. పరిశ్రమలకిచ్చే హెచ్‌టీ కనెక్షన్‌ను తీసుకోవాలంటూ షరతు పెట్టారు. దీంతో ప్లాంట్ పెట్టిన రైతులకు ఉచిత విద్యుత్తు కనెక్షన్ పోయినట్టే. రైతుభరోసా సాయమూ అందదు. ఈ హెచ్‌టీ కనెక్షన్‌తో ఒక్కో రైతుకు నెలకు రూ.50 వేల వరకు విద్యుత్తు బిల్లుగా చెల్లించాల్సిందే. సోలార్ ప్లాంట్లకు హెచ్‌టీ విద్యుత్తు కనెక్షన్ తీసుకోవాలన్న నిబంధనను రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. పవర్ పర్చేజ్ అగ్రిమెంట్లలో పొందుపరిచిన మూడు నిబంధనలనూ మార్చాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు. పీఎం కుసుమ్ స్కీం కింద రైతులు తమ పొలాల్లో 2 మెగావాట్ల సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉన్నది. రైతులు 0.5 మెగావాట్ నుంచి 2 మెగావాట్ల వరకు సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకునే వెసులుబాటును కల్పించారు. ఇప్పటివరకు 1,800 మెగావాట్ల ప్లాంట్ల ఏర్పాటుకు రైతులు ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (ఈఎండీ) చెల్లించారు. ఈఎండీ చెల్లించిన వారితో డిస్కంలు పవర్ పర్చేజ్ అగ్రిమెంట్లు (పీపీఏ) కుదుర్చుకోవాల్సి ఉన్నది. ఈ పీపీఏలను బట్టే బ్యాంకులు రుణాలను మంజూరుచేస్తాయి. రుణాలు పొందాక ప్లాంట్లు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుంది. రైతులతో పీపీఏలు కుదుర్చుకునేందుకు ఇప్పటికే రంగం సిద్ధమైంది. ఆది, సోమవారాల్లో పీపీఏ ఒప్పందాలపై సంతకాలు చేసేందుకు రావాలంటూ టీజీ రెడ్కో అధికారులు లబ్ధిదారులైన రైతులకు సమాచారం ఇచ్చారు.

### రైతులకు నష్టం కలిగించే నిబంధనలు ఇవే..

- సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకునే రైతులు 70 కిలోవాట్ (హెచ్‌టీ) కనెక్షన్ తీసుకోవాలి. ఒక్కో వినియోగదారుడు ఒక కేవీఏకు రూ.475 డిమాండ్ చార్జీలను చెల్లించాల్సి ఉంటుంది. అంటే నెలకు రూ.33 వేలకు పైగా చెల్లించాలి. విద్యుత్తు చార్జీల కింద కనీసంగా నెలకు రూ.18 వేలు చెల్లించాల్సి ఉంటుంది. అంటే ఈ మొత్తం రూ.50 వేలు అవుతుంది. వాస్తవానికి బోరుబావి, మోటర్, లైట్, ఫ్యాన్లు వాడే వారికి 10 కేవీఏ వరకు సరిపోతుంది. కానీ బలవంతంగా 70 కేవీఏ హెచ్‌టీ కనెక్షన్ కట్టబెడుతున్నారు. అంటే నెలకు రూ.50 వేల చొప్పున ఏటా రూ.6లక్షలు డిస్కంలకు రైతులు చెల్లించాలి. ఇది రైతులకు పెనుభారం కానున్నది.
- సోలార్ ప్లాంట్‌లో జనరేషన్ కెపాసిటీ యుటిలైజేషన్ ఫ్యాక్టర్ 19 శాతంగా ఉండాలని నిర్ణయించారు. అంతకు 10 శాతం ఎక్కువ విద్యుత్తు జనరేట్ అయితే డిస్కం బిల్లులు చెల్లించదు. 10 శాతం కంటే తక్కువ విద్యుత్తు ఉత్పత్తి అయితే మాత్రం పెనాల్టీ విధిస్తామని మెలిక పెట్టారు. ఉదాహరణకు 100 యూనిట్ల ప్లాంట్లు 110 యూనిట్ల విద్యుత్తు జనరేట్ చేస్తే అంతవరకు డిస్కం చార్జీలు చెల్లిస్తుంది. ఒకవేళ 120 యూనిట్లు జనరేట్ చేస్తే 10 యూనిట్లకు బిల్లు చెల్లించరు. కేవలం 110 యూనిట్లకే చెల్లిస్తారు. అదే ఒకవేళ 100 యూనిట్ల ప్లాంట్ 90 యూనిట్లు జనరేట్ చేస్తే పెనాల్టీ విధిస్తారు. ఇది రైతుల పాలిట శాపంగా మారనున్నది.
- సోలార్ విద్యుత్తుకు రెఫరల్ వోల్టేజ్ (థర్మల్, హైడల్) తప్పనిసరి. రెఫరల్ వోల్టేజ్ లేకపోతే సోలార్ విద్యుత్తు జనరేట్ అయినా నిరుపయోగమే. ఒకవేళ గంటల తరబడి బ్రేక్‌డౌన్స్, విద్యుత్తు కోతలుంటే సోలార్ ఉత్పత్తి అయినా డిస్కంలు తీసుకోలేవు. దీంతో రైతులకు తీవ్ర నష్టం కలగనుంది. ఇలా కలిగే నష్టానికి డిస్కంలు పరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కేంద్ర పునరుత్పాదక ఇంధన వనరుల మంత్రిత్వశాఖ మాడల్ పీపీఏ క్లాస్ 4.9లో జనరేషన్ కాంపెన్సేషన్ క్లాజు ఉన్నదని. దీనిని చేర్చి, పరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

### షరతులతో రైతులకు తీవ్ర నష్టం

పవర్ పర్చేజ్ అగ్రిమెంట్లలో పొందుపరిచిన షరతులతో రైతులకు తీవ్ర నష్టం కలుగుతుంది. ఇదే విషయంపై రైతులంతా ఆందోళనలో ఉన్నారు. మేమే కూడా పలుమార్లు అధికారులను కలిసి వినతిపత్రాలు ఇచ్చాం. నిబంధనలు మార్చాలని కోరాం. అయినా టీజీ రెడ్కో, డిస్కం అధికారులు పరిగణనలోకి తీసుకోలేదు.

– బుర్రా అశోక్‌కుమార్, తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ అధ్యక్షుడు

### రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత

ఉచిత విద్యుత్తు కనెక్షన్, రైతు భరోసాకు కోతపెట్టడం, హెచ్‌టీ కనెక్షన్లు జారీచేయడం, యుటిలైజేషన్ ఫ్యాక్టర్, రెఫరల్ వోల్టేజ్ వంటి సమస్యల నేపథ్యంలో పీపీఏ పట్ల లబ్ధిదారులైన రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతున్నది. అసలు పీపీఏల్లో ఏమున్నదో, ఏ నిబంధనలు పెట్టారో? నిరక్షరాస్యులైన రైతులకు తెలియదు. కానీ 50-60 పేజీలపై సంతకాలు పెట్టించుకునేందుకు అధికారులు రంగం సిద్ధం చేసినట్టు సమాచారం. ఒక్కసారి పీపీఏలు కుదిరిన తర్వాత మార్పులు చేయడం అసాధ్యం. 25 ఏండ్లపాటు ఇదే అగ్రిమెంట్ కొనసాగుతుంది. ఈ తరుణంలో ఒప్పందంపై సంతకాలు చేయాలా? వద్దా? అన్న మీమాంసలో రైతులు ఉన్నారు.



జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మేడిగడ్డ బరాజ్ వద్ద కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న బాధిత కుటుంబసభ్యులు

# మేడిగడ్డ బరాజ్‌లో ఆరుగురు గల్లంతు

- ఈతకు వెళ్లిన సమయంలో ఘటన
- కొనసాగుతున్న గాలింపు చర్యలు
- అంబట్‌పల్లి, కొర్లకుంటలో విషాదఛాయలు

మహదేవపూర్, జూన్ 7: ఈతకు వెళ్లి ఆరుగురు యువకులు గల్లంతైన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల పరిధి అంబట్‌పల్లిలోని మేడిగడ్డ బరాజ్‌వద్ద జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. శనివారం 8మంది స్నేహితులు మేడిగడ్డ బరాజ్‌లోకి ఈతకు వెళ్లారు. వారిలో ఆరుగురు గల్లంతు కాగా, ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు. అంబట్‌పల్లికి చెందిన పత్తి మధుసూదన్ (18), పట్టి శివమనోజ్ (15), తొగరి రక్షిత్ (13), కర్నాల సాగర్ (16), మహాముత్తారం మండలం కొర్లకుంటకు చెందిన పండు (18), రాహుల్ (19) మేడిగడ్డ బరాజ్‌లోకి ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు గల్లంతయ్యారు. వారితోపాటు వెళ్లిన పట్టి శివమణి, పట్టి వెంకటస్వామి సురక్షితంగా బయటపడ్డారు. కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, ఎస్సై పవన్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని గాలింపుచర్యలు చేపడుతున్నారు. కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్ సహాయక చర్యలపై ఆరా తీశారు. సింగరేణి రెస్క్యూ టీం గాలింపు చర్యలు చేపడుతున్నది. గల్లంతైన వారి కోసం కుటుంబీకులు కన్నీరు మున్నీరయ్యారు.

### గోదావరిలో ఫొటోలు, వీడియోలు నిషేధం: ఇన్‌చార్జి కలెక్టర్ దివాకర

భూపాలపల్లి రూరల్, జూన్ 7 : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని గోదావరి పరీవాహక ప్రాంతాల్లో ఈత కొట్టడం, ఫొటోలు, వీడియోలు తీయడంపై నిషేధం విధించినట్టు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ టీఎస్ దివాకర తెలిపారు. గోదావరిలో ఈత కొట్టడం, ఫొటోలు దిగడం, సోషల్ మీడియా కోసం వీడియోలు తీయడం వంటి వాటితో ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.



హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్

## బూటకపు ఎన్‌కౌంటర్లను ఆపాలి

**తెలంగాణ పౌరహక్కుల సంఘం డిమాండ్**

హిమాయత్‌నగర్ జూన్ 7: కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తుందని తెలంగాణ పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ జీ లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఎన్ నారాయణ ఆరోపించారు. హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. మావోయిస్టు నాయకులు బండి ప్రకాశ్, నేషనల్ పార్క్ కార్యదర్శి దిలీప్, మద్దెడ్ ఏరియా కార్యదర్శి రామన్న తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. వారిని అరెస్ట్ చేసినట్టు ఇప్పటికీ ప్రకటించలేదని ఆందోళన వ్యక్తంచేశారు. కగార్ పేరుతో ఆదివాసీలను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నదని మండిపడ్డారు. బూటకపు ఎన్‌కౌంటర్లపై సిట్టింగ్ జడ్జిచేత విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు.

# మావోయిస్టు నేతలను కోర్టులో హాజరుపర్చాలి

**వామపక్ష పార్టీల డిమాండ్**

హైదరాబాద్, జూన్ 7 (నమస్తే తెలంగాణ): ఛత్తీస్‌గఢ్ బీజాపూర్‌లో పోలీసుల కస్టడీలో ఉన్న మావోయిస్టు నేతలను వెంటనే కోర్టులో హాజరుపర్చాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. శనివారం సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో వామపక్ష పార్టీలు సమావేశమయ్యాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఆపరేషన్ కగార్‌ను తక్షణం నిలిపివేసి, మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఇటీవల మావోయిస్టు అగ్రనాయకులను ఎన్‌కౌంటర్ చేయడం బాధాకరమని అన్నారు. 20మంది మావోయిస్టు నేతలను పోలీసుల కస్టడీలో ఉన్నారని.. వాళ్లను కాల్చి చంపి ఎన్‌కౌంటర్లుగా ప్రకటించే అవకాశం ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. సుధాకర్, సురేశ్ తదితరుల ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని డిమాండ్‌చేశారు. దాయాది పాకిస్థాన్‌తో చర్చలు జరిపిన మోదీ.. మావోయిస్టులతో ఎందుకు చర్చలు జరపడం లేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి పీ సూర్యం, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, సీపీఐఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.




ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్‌లోని తెలంగాణచౌక్‌లో నిరసన ప్రదర్శన చేస్తున్న సీపీఎం, సీపీఐ, అనుబంధ సంఘాల నాయకులు

## ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని నిరసన

కరీంనగర్ తెలంగాణచౌక్, జూన్ 7 : కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ శనివారం కరీంనగర్‌లోని తెలంగాణచౌక్‌లో వామపక్ష ప్రజా సంఘాల నాయకులు వాటి అనుబంధ విభాగాల కమిటీలతో కలిసి నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం, సీపీఐ నాయకులు మిల్కూరి వాసుదేవరెడ్డి, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రూ.లక్షల కోట్ల విలువైన అటవీ, ఖనిజ సంపదను తమ అనుకూల కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం కోసమే కేంద్రం మావోయిస్టులను లక్ష్యంగా చేసుకొని బూటకపు ఎన్‌కౌంటర్లు చేయిస్తున్నదని మండిపడ్డారు.